క్లుప్తంగా

అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీ

గజపతినగరం: వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో పాల్గొని ఆయన స్వయంగా ట్రాక్టర్ నడిపారు. అన్నదాతకు అండగా ఉంటామని ఈ సందర్భంగా చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పడాల అరుణ, ఏఎంసీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు, వైస్ చైర్మన్ కె.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరం విజయవంతం



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

చీపురుపల్లి: పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. పట్టణంలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ ఆవరణలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు పాల్గొని రోగులను పరీక్షించారు. 74 మందిని పరీక్షించి 34 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వారందరికీ పుష్పగిరి ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ పి.సుధీర్, మానవీయత సంస్థ వ్యవస్థాపకుడు బీవీ గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్

● డీఎల్‌డీఓ హేమసుందరరావు



రక్షిత మంచినీటి పథకాలను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ హేమసుందరరావు

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు తాగునీరు సరఫరా చేసే రక్షిత మంచినీటి పథకాల్లో ప్రతిరోజూ తప్పని సరిగా క్లోరినేషన్ చేపట్టాలని డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ) కె.హేమసుందరరావు సూచించారు. మండలంలోని దేవరపొదిలాం లో రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ, పారిశుధ్య పరిస్థితులపై ఆరా తీశారు. ప్రతి 15 రోజులకోసారి డ్రై డే పాటించాలని, ప్రతి రోజూ క్లోరినేషన్ చేయించాలన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరణ కచ్చితంగా జరగాలని సూచించారు.

రేపటి లోగా ప్రీమియం చెల్లించాలి

గజపతినగరం: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి సంబంధించి ఈ నెల 15లోగా బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి పి.కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..రూ. 200 ప్రీమియం మొత్తం చెల్లించి బీమా పొందాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



ఎ.రవికుమార్

గుర్ల: ఎంపీడీఓగా పి. రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వరప్రసాద్, ఈఓపీఆర్‌డీ అన్నపూర్ణాదేవి ఎంపీడీఓకు స్వాగతం పలికారు.


గడిగెడ్డ నీరు విడుదల



సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

గుర్ల: మండలంలోని తాతావారి కిట్టాలి వద్దనున్న గడిగెడ్డ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువ గేట్లు తెరిచి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు బుధవారం సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజర్వాయర్ కిందనున్న సుమారు నాలుగు వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఇరిగేషన్ ఏఈ సంతోష్, టీడీపీ నేతలు వెన్నె సన్యాసినాయుడు, టి. కిరణ్‌కుమార్, చనమల్లు మహేశ్వరరావు, మండల అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అర్తమూరులో విద్యుత్ కోతలు..



అర్తమూరు

● నెలన్నర రోజులుగా ఇదే పరిస్థితి
● హై, లో ఓల్టేజీ సమస్యతో కాలిపోతున్న ఫ్యాన్లు, టీవీలు
● విద్యుత్ కోతలతో అవస్థలు పడుతున్న వైనం
● మరోవైపు పంటలకు కష్టకాలం

చీపురుపల్లి రూరల్ (గరివిడి):

రోజులో ఓ అరగంట, గంట కాలం పాటు విద్యుత్ ఉండకపోవడం సహజం. అదే రోజులో గంట సేపు విద్యుత్ ఉంటే మరో మూడు గంటలు సరఫరా ఉండకపోతే కచ్చితంగా అధికారుల వైఫల్యమనే చెప్పాలి. గరివిడి మండలంలోని అర్తమూరు ప్రజలు నెలన్నర రోజులుగా విద్యుత్ కోతలతో అవస్థలు పడుతున్నారు. గ్రామంలో సుమారు ఆరు వందల గృహాలున్నాయి. ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోతుండడంతో పగలు, రాత్రి తేడా లేకుండా నరకం అనుభవిస్తున్నామని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు వేసవిని తలపించే ఎండల వల్ల ఉక్కపోతతో ఉండలేకపోతున్నామని, కనీసం ఫ్యాన్ గాలికి నోచుకోలేకపోతున్నామని వాపోతున్నారు. ఎప్పుడు విద్యుత్ సరఫరా ఉంటుందో.. ఎప్పుడు ఉండదో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ సరఫరా ఉన్నా ఒక్కోసారి హై ఓల్టేజీ.. మరోసారి లో ఓల్టేజీ వస్తోందని.. దీంతో ఫ్యాన్లు, టీవీలు కాలిపోతున్నామని చెబుతున్నారు. మరోవైపు ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో పంటలు వాడిపోతున్నాయని... వర్షాలు లేకపోవడంతో కనీసం బోర్ల నుంచి కూడా నీరు అందించలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని అర్తమూరు వాసులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



నెలన్నర రోజులుగా విద్యుత్ కోతలతో ఇబ్బంది పడుతున్నాం. ఎప్పుడు సరఫరా ఉంటుందో.. ఎప్పుడు ఉండదో తెలియడం లేదు. గంట కాలం సరఫరా ఉంటే మరో మూడు గంటలు ఉండడం లేదు. రాత్రి సమయంలో కంటిమీదు కునుకు ఉండడం లేదు.

– గులివిందుల అప్పలసూరమ్మ, గృహిణి, అర్తమూరు గ్రామం

నీటి తడులు అందించలేకపోతున్నాం..



విద్యుత్ సమస్యల వల్ల పంటలకు నీటి తడులు అందించలేకపోతున్నాం. ఎప్పుడు హై ఓల్టేజీ వస్తుందో.. ఎప్పుడు లో ఓల్టేజీ వస్తుందో తెలియడం లేదు. గృహోపకరణాలు కాలిపోతున్నాయి. వర్షాలు లేక.. విద్యుత్ సరఫరా లేక పంటలను కాపాడుకోలేకపోతున్నాం.

– ఎం. రాజారావు, వార్డుమెంబర్, అర్తమూరు

మాట మార్చడం చంద్రబాబు నైజం..



లక్కవరపుకోట: జమ్మాదేవిపేటలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు తూర్పాటి వరలక్ష్మి

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అయితే ఇచ్చిన మాటను మర్చిపోవడం చంద్రబాబు నైజమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. జామి మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో.. లక్కవరపుకోట మండలంలోని జమ్మాదేవిపేట, రంగాపురం గ్రామాల్లో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు సారథ్యంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలను వివరించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోవడం వల్ల ఒక్కో కుటుంబానికి కలిగిన నష్టాన్ని వివరిచారు. హామీలు అమలు చేయని కూటమి నాయకులు గ్రామాలకు వస్తే నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఎస్.కోట: జామిలో కూటమి మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు

– ఎస్.కోట/లక్కవరపుకోట

16న రాధాకృష్ణ వేషధారణల పోటీలు

చీపురుపల్లి: పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ కేంద్రంలో ఈ నెల 16న రాధాకృష్ణల వేషధారణ పోటీలు నిర్వహించనున్నట్లు కేంద్ర ఇన్‌చార్జ్ బీకే శాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణాష్టమి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఐదేళ్ల లోపు వయస్సు గల వారు జూనియర్స్ విభాగంలోనూ, ఆరేళ్ల నుంచి పదేళ్ల వయస్సు గల వారు సీనియర్స్ విభాగంలో పోటీ పడాల్సి ఉంటుందన్నారు. విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రంలోగా 83099 74599 నంబర్‌ను సంప్రదించి తమ వివరాలు తెలియజేయాలని కోరారు.

నేటి నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

చీపురుపల్లి: పట్టణంలోని కొత్త గవిడివీధిలో గల గీతామందిరంలో గురువారం నుంచి 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు గీతా సత్సంగ్ సేవాశ్రమం సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న శ్రీకృష్ణాష్టమి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజులు వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి శ్రీమద్భగవద్గీత సంపూర్ణ పారాయణం, సాయంత్రం 3 గంటల నుంచి శ్రీమద్భగవద్గీత వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు.

నాటు తుపాకులు కలిగి ఉండడం నేరం

● విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు



కొత్తవలసలో ఇటీవల స్వాధీనం చేసుకున్న ఎయిర్ తుపాకీలను చూపిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ షణ్ముఖరావు

కొత్తవలస: నాటు తుపాకులు కలిగి ఉండడం నేరమని విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. ఓ కేసు నిమిత్తం కొత్తవలస పోలీస్‌స్టేషన్‌కు బుధవారం వచ్చిన ఆయన స్థానిక విలేకరలతో మాట్లాడారు. గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతూ నాటు తుపాకుల వినియోగంపై ఆరా తీస్తున్నట్లు చెప్పారు. ఇటీవల కాలంలో జిల్లాలో నాటు తుపాకీ కాల్పులు ఎక్కువగా చోటుచేసుకోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేపడుతున్నామన్నారు. పోలీస్ రికార్డుల ప్రకారం డివిజన్ పరిధిలో ఎంత మందికి తుపాకీ లైసెన్స్‌లు ఉన్నాయి.. ప్రస్తుతం ఆ తుపాకీలు ఎక్కడ ఉన్నాయి.. భద్రంగా ఉన్నాయా, లేదా అన్నా విషయాలను కూడా తెలుసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే దొంగతనాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఆయన వెంట సీఐ సీహెచ్.షణ్ముఖరావు, ఎస్సై ప్రసాదరావు, ఏఎస్సై యువరాజ్, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం..

● ఇన్‌చార్జ్ ఆర్డీఓ ఆశయ్య



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఇన్‌చార్జ్ ఆర్‌డీఓ ఆశయ్య

చీపురుపల్లి: మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఇన్‌చార్జ్ ఆర్డీఓ బి. ఆశయ్య పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల నిర్మూలనే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలతో యువత జీవితాలు నాశనమైపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం .రమేష్‌కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జ్వాలాముఖి, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ బి.విజయేశ్వరరావు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంయూ కార్మికుల ధర్నా



ఎస్.కోట డిపోలో ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ కార్మికులు

శృంగవరపుకోట: రాష్ట్ర కౌన్సిల్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఎస్.కోట ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్మికులు బుధవారం మధ్యాహ్నం భోజన సమయంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ..లులూ కంపెనీకి గవర్నర్‌పేట–2 డిపోకి చెందిన స్థలం కేటాయించడం సరికాదన్నారు. ఇందుకు నిరసనగా 12, 13 తేదీల్లో డిపోల్లో ధర్నాలు చేపట్టాలని రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు డిపో కార్యదర్శి ఎ.రాజయ్య, అధ్యక్షుడు జీవీ రమణ, రీజియన్ కమిటీ సభ్యుడు కె.ఆనంద్, జోనల్ వైస్ ప్రెసిడెంట్ జీఎస్ రాజు, రీజనల్ చైర్మన్ సీహెచ్ఎస్‌వీఆర్ మూర్తి, తదితరులు ధర్నా చేశారు. కార్మికులకు తక్షణమే పీఆర్‌సీ ఏర్పాటు చేయాలని.. ఐఆర్ ప్రకటించాలని.. లులూ కంపెనీకి స్థలం కేటాయిస్తూ ఇచ్చిన జీఓను రద్దు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పలువురు డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ ఉద్యోగులు పాల్గొన్నారు.

లేనిపోని హామీలతో మోసం



కూటమి మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గజపతినగరం రూరల్: లేనిపోని హామీలతో ప్రజలను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు అన్నారు. మండలంలోని అంజిపురంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి పాలన మోసాలపై వివరించారు. ప్రజలకు ఎంతో మేలు చేసే సచివాలయ వ్యవస్థను సైతం నిర్వీర్యం చేశారని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడం వల్ల ఒక్కో కుటుంబం ఎంత నష్టపోయినదీ ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గూడు వెంకటరావు, కె.పైడపునాయుడు, బెల్లాన త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ప్రతులను పంచుతాం..



ఎస్.కోట తహసీల్దార్ శ్రీనివాసరావుకు రాజ్యాంగ ప్రతి ఇస్తున్న దళిత విజ్ఞాన కేంద్రం సభ్యులు

శృంగవరపుకోట: భారతరత్న బాబాసాహెబ్ అంబేడ్కర్ చరిత్రను, రాజ్యాంగ ప్రతులను ప్రజలకు అందిస్తామని దళిత ఉద్యమ నాయకుడు ఆతవ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం సభ్యులతో కలిసి స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరావును బుధవారం కలసి రాజ్యాంగ ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. నెలాఖరును పోతనాపల్లి, గౌరమ్మపేట గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జోల కేశవ, టి. కోటరావు, ఎం.వెంకటరమణ, ఎం.దేవా, కె.రాంబాబు, కృష్ణ, శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలి



మెరకముడిదాం: హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



కొత్తవలస: మూడు రోడ్ల జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడిన ఉద్యోగులు

● ఎంపీడీఓ భాస్కరరావు

మెరకముడిదాం: ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలని ఎంపీడీఓ గొర్లె భాస్కరరావు అన్నారు. మండలంలోని గర్భాంలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. సుమారు 100 బైక్‌లతో గర్భాం సచివాలయం–2 నుంచి గర్భాం గ్రామంలో గల పలు వీధుల మీదుగా ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం ఏఓ సుధాకర్ పట్నాయక్, డిప్యూటీ ఎంపీడీఓ రామునాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్తవలసలో ..

కొత్తవలస: మండల కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులు, ఉద్యోగులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. మూడు రోడ్ల జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న సంఘ సభ్యులు

కొత్తవలస: మండల కేంద్రంలో గల ఏపీ ఎన్జీఓ భవనంలో కొత్తవలస, శృంగవరపుకోట తాలుకాల సంఘ నాయకులు బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేవీ ప్రసాదరావు, శ్రీనివాస్ మాట్లాడుతూ.. 12 లక్షల మంది ఉద్యోగులకు ఏపీ ఎన్జీఓ సంఘం ప్రాతినిధ్యం వహిస్తోందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షన్‌దారుల హక్కుల సాధనకై సంఘం నిరంతరం పని చేస్తోందన్నారు. ఉద్యోగులకు కొత్త పీఆర్‌సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

32 మంది రోగులకు వైద్యసేవలు

వేపాడ: మండలంలో శింగరాయి గ్రామంలో 104 సిబ్బంది బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 32 మంది రోగులకు వైద్య సేవలు అందించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గడువు పెంపు

మెరకముడిదాం: ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు సంబంధించి గడువును ఈనెల 20 వరకు పెంచినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎంఈఓలు చంద్రశేఖర్, ధర్మశ్రీను బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే పాఠశాలకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న విద్యార్థులకు మాత్రమే వర్తించే షరతును ఐదు కిలోమీటర్ల వరకు పెంచిందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అందుబాటులో ఉండాలి

దత్తిరాజేరు: భారీ తుఫాన్ ప్రభావం ఉన్నందున గ్రామాలలో వీఆర్‌ఓలు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ విజయభాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బందికి సెలవులు ఇవ్వలేమని స్పష్టం చేశారు. వర్షాల వల్ల ఎటువంటి నష్టం జరిగినా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామాలలో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివాజీ గ్రామ కార్యదర్శులను ఆదేశించారు.

నిత్యావసర సరకుల పంపిణీ



సూరికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

గుర్ల: మండలంలోని పాలాయవలసలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో చదువులు సూరికి చెందిన పురిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంటిలో ఉన్న వస్తువులతో పాటు నిత్యావసర సరుకులు కాలిపోయాయి. దీంతో గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ సభ్యులు బాధితుడికి బుధవారం నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు.

పోలీసుల తనిఖీలు



శ్రీనివాసకాలనీలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

శృంగవరపుకోట: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్.కోట పోలీసులు బుధవారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. శ్రీనివాస కాలనీలో ఎనిమిదిళ్లు, బర్మా కాలనీలో 15 ఇళ్లు, కొత్తఅడ్డతీగ గ్రామంలో 40 ఇళ్లల్లో సోదాలు చేశారు. ఈ సందర్భంగా ఎవరైనా నాటు తుపాకులు కలిగి ఉన్నారా అన్నది ఆరా తీశారు. ఆయుధాలు ఉంటే స్వచ్ఛందంగా అందజేయాలని కోరారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం..

శృంగవరపుకోట: రైతులకు ఇచ్చిన మాట కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. లక్కవరపుకోట మండలం గోల్డ్‌స్టార్ జంక్షన్ నుంచి ఎస్.కోట దేవీ జంక్షన్ వరకు బుధవారం ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ఆగస్టు 15వ తేదీనుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

దత్తిరాజేరు: వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరరించాలని ఎస్. భూర్జవలస ఎస్సై జి. రాజేష్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం మత్తులో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పకుండా హెల్మెట్ ధరిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చని సూచించారు. మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసు నమోదు చేస్తామన్నారు.

విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం

శృంగవరపుకోట: వసతి గృహ విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎస్.కోట గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహం సంక్షేమాధికారిణి శాంతి రమణకుమారి బుధవారం తెలిపారు. వసతి గృహంలో ఎలాంటి సమస్యలు లేవన్నారు. మెనూ పాటిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు పస్తులతో నిరసన తెలిపినట్టు ప్రచురితమైన వార్త తమ వసతిగృహం పరిధిలోది కాదన్నారు. తమ హాస్టల్‌లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. జిల్లా అధికారుల పర్యవేక్షణలో, వారి సూచనల మేరకు కచ్చితమైన మెనూ ప్రకారం భోజనం, వసతి, సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆమె వివరించారు.

15 లోగా ప్రీమియం చెల్లించాలి..



పొలంబడి కార్యక్రమంలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ స్వాతి

వేపాడ: ఖరీఫ్ వరి పంటకు సంబంధించి ఈ నెల 15వ తేదీ వరకు బీమా ప్రీమియం చెల్లించవచ్చని ఏఓ స్వామి తెలిపారు. మండలంలోని గుడివాడ, సోంపురం గ్రామాల్లో బుధవారం పొలంబడి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల బీమాపై అవగాహన కల్పించారు. సర్పంచ్ గంగరాజు, గోపీ, ఏఈఓ అక్కునాయుడు, వీఏఏలు పాల్గొన్నారు.